
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 10 మే 2025




గిలకలదిండి సముద్రతీరంలో ఎస్పీ గంగాధరరావు తనిఖీలు

తీరంలో గస్తీ ముమ్మరం

- గిలకలదిండి వద్ద ఎస్పీ గంగాధరరావు తనిఖీలు
- పడవల్లో సముద్రంలోకి వెళ్లి పరిశీలన

6



శుక్రవారం రాత్రి విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేసే బలగాలకు సూచనలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



జవాన్ మురళీ నాయక్ ప్రాణత్యాగాన్ని స్మరిస్తూ అవనిగడ్డలో కొవ్వొత్తుల ర్యాలీ



గన్నవరం ఎయిర్‌పోర్టులో భద్రతా బలగాల తనిఖీలు

అలర్ట్

జిల్లాలో భద్రత పెంపు



ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అప్రమత్తం

- విజయవాడను జల్లెడ పట్టిన పోలీసులు
- ప్రధాన రైల్వేస్టేషన్లు, బస్టాండ్లపై నిఘా
- గన్నవరం ఎయిర్‌పోర్టులో మూడంచెల భద్రత
- ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న తనిఖీలు
- ఎన్టీటీపీఎస్ వద్ద బందోబస్తు కట్టుదిట్టం
- గిలకలదిండి తీరంలో పోలీసుల పరిశీలన
- భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీలు

'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా దేశ సరిహద్దుల్లో యుద్ధ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం జిల్లాలో యంత్రాంగం అప్రమత్తమైంది. విజయవాడలో నిఘాను కట్టుదిట్టం చేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రధాన బస్టాండ్లు, విజయవాడ, గుడివాడ రైల్వేస్టేషన్ సహా రద్దీ ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు. గిలకలదిండి సముద్రతీర ప్రాంతాన్ని కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు పరిశీలించారు. సెలవుల్లో ఉన్న సిబ్బంది వెంటనే వచ్చి విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చారు. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. సీఐఎస్ఎఫ్, ఎస్పీఎఫ్, స్థానిక పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై పోలీసుల నిఘా కొనసాగుతోంది. మెటల్ డిటెక్టర్ల ద్వారా ప్రతి ఒక్కరి కదలికలను పరిశీలిస్తున్నారు. కొండపల్లిలోని హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి ఆయిల్ రిఫైనరీ కంపెనీలు, ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ వద్ద బందోబస్తు పెంచారు. కాగా, భారత సైన్యం వీరోచిత పోరాటాలను, జవాన్ మురళీనాయక్ ప్రాణత్యాగాన్ని స్మరిస్తూ రెండు జిల్లాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబూని జైహింద్ నినాదాలు చేశారు.

- వివరాలు 6లో



భారత సైన్యానికి మద్దతుగా విజయవాడలో జాతీయ జెండాలు చేతబూని ర్యాలీగా వెళ్తున్న మహిళలు


అమ్మో.. అనధికార లే అవుట్లు!

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 68 వరకు గుర్తింపు

అధికారికంగా ప్రకటించిన సీఆర్‌డీఏ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సుప్రీంకోర్టు ఆదేశాలున్నా రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోని ఉమ్మడి కృష్ణా జిల్లాలో అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. సీఆర్‌డీఏ విడుదల చేసిన ఈ జాబితాలో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 68 అనధికార లే అవుట్లు ఉన్నాయి. ఇవి సీఆర్‌డీఏ అధికారులు గుర్తించినవే కాగా, గుర్తించనివి 200కు పైగానే ఉంటాయని తెలుస్తోంది. నాన్ లే అవుట్లను క్రమబద్ధీకరించేది లేదని సుప్రీం స్పష్టంగా తీర్పునిచ్చినా రాజధాని ప్రాంత పరిధిలో ఇవి పుట్టుకొస్తూనే ఉన్నాయి. సుప్రీం మార్గదర్శకాలపై అవగాహన లేనివారు భవిష్యత్తులో ఎల్‌పీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవచ్చనే ఆలోచనతో వీటిని కొంటున్నారు. గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లోనే ఇవి ఎక్కువగా ఉన్నాయని సమాచారం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ముందు ఇలా నాన్ లే అవుట్లలో ప్లాట్లను కొన్నవారు తర్వాత క్రమంలో ఎల్ఆర్ఎస్ వంటి స్కీమ్‌లు వచ్చినపుడు అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకునేవారు. కానీ, ఇప్పుడలా లేదు. నాన్ లే అవుట్లను క్రమబద్ధీకరించే వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా తెలిపింది. తక్కువ ధరకు వస్తాయన్న ఉద్దేశంతో ఆశపడి పెద్ద ఎత్తున వీటిని కొంటున్నారు. లే అవుట్లు వేసేవారు కూడా సీఆర్‌డీఏ లే అవుట్ అంటూ అబద్ధపు ప్రకటనలు చేస్తూ కొనుగోలుదారులను మభ్యపెడుతున్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని నూజివీడు జోన్‌లో 29 అక్రమ లే అవుట్లను సీఆర్‌డీఏ గుర్తించగా, మైలవరం, నందిగామలో భారీగా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. అలాగే, గన్నవరం జోన్ పరిధిలోకి వచ్చే గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల పరిధిలో 16 అక్రమ లే అవుట్లు ఉన్నాయి.

దుర్గగుడి ఈవోగా శీనా నాయక్ బాధ్యతల స్వీకారం



6లో

దుర్గగుడిలో వివిధ విభాగాల పరిశీలన

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

అమరావతి రైల్వేలైను నిర్మాణానికి ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల్లో భూముల సర్వే, పెగ్ మార్కింగ్ పూర్తి

- భూములిచ్చేందుకు దాదాపు రైతులందరూ అంగీకారం
- తుది నోటిఫికేషన్ విడుదలకు అధికారుల కసరత్తు

6లో

నేడు కోల్డ్ స్టోరేజి బాధితులకు చెల్లింపులు

- అంతుబట్టని యాజమాన్య వైఖరి
- రైతులకు అందని సమాచారం
- మౌనముద్రలో అధికారులు

6లో

- ధర నిర్ణయించాలని కొత్తగా మార్కెటింగ్ ఏడీకి లేఖ

కేయూ రెక్టార్ బసవేశ్వరరావుకు అరుదైన గౌరవం

జీవితకాల సభ్యత్వం ఇచ్చిన వాషింగ్టన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్

6



గన్నవరం విమానాశ్రయంలో వాహనాల తనిఖీ..



విజయవాడ రైల్వేస్టేషన్‌లో డాగ్, బాంబ్‌స్క్వాడ్‌ల తనిఖీలు



ఇంద్రకీలాద్రిపై భక్తుల బ్యాగులు పరిశీలిస్తున్న పోలీసులు



పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో..

నగరంలో నిరంతర నిఘా!

- రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌లకు భద్రత పెంపు
- సిబ్బందికి సెలవులు రద్దు
- రైల్వేస్టేషన్‌లో పెరిగిన బేస్ క్యాంపులు
- తనిఖీలతో జల్లెడ పడుతున్న పోలీసులు

దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తత వాతావరణం నేపథ్యంలో విజయవాడ నగరంలో నిఘాను కట్టుదిట్టం చేశారు. ప్రజలు, ప్రయాణికులు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో భద్రతను రెట్టింపు చేశారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలకు విజయవాడ రైల్వేస్టేషన్ జంక్షన్‌గా ఉంది. పండిట్‌నెహ్రూ బస్‌స్టేషన్, షాపింగ్ మాల్స్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర నిఘా వర్గాల ఆదేశాలతో పోలీసులు అన్ని ప్రదేశాలను జల్లెడపడుతున్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు బేస్ క్యాంప్‌ల సంఖ్యను పెంపుదల చేశారు. సెలవుల్లో ఉన్న సిబ్బందిని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పోలీసులు నగరంలోని లాడ్జిలు, హోటళ్లు, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేస్తున్నారు. రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను, వాహనాలను ఏర్పాటు చేశారు. నిర్మానుష్య ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తూ సోదాలు చేస్తున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు రాత్రిపూట విధుల్లో కచ్చితంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అనుమానిత వ్యక్తులను ఐరీస్ వాహనం ద్వారా తనిఖీ చేసిన అనంతరం కౌన్సెలింగ్ చేస్తున్నారు. అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో..

అటు ఉత్తరాది, ఇటు దక్షిణాది నుంచి రాకపోకలు సాగించే రైళ్లకు విజయవాడస్టేషన్ ప్రధాన జంక్షన్‌గా ఉంది. నిత్యం వేలాది మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ స్టేషన్ నిరంతరం ప్రయాణికులు, పార్శిల్ సర్వీసులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రవేశ ద్వారాలతోపాటు ట్రాక్‌ల వైపు నుంచి ఉన్న మార్గాల్లోను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు భద్రతను పెంచారు. సంయుక్తంగా మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. స్టేషన్ చుట్టూ ఉన్న సీసీ కెమెరాలను 24/7 పరిశీలిస్తున్నారు. కొంతమంది సివిల్ దుస్తుల్లో నిఘా పెట్టారు. ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు.

పీఎన్‌బీఎస్‌లో..



విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మొత్తం 60 ప్లాట్‌ఫాంల నుంచి ప్రయాణికులు వస్తూపోతూ ఉంటారు. ప్లాట్‌ఫాంలపై గస్తీని రెట్టింపు చేశారు. బస్సుల్లోకి ఎక్కే, దిగే ప్రయాణికుల లగేజీలను డాగ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు చేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని ప్రదేశాలను సిబ్బంది నిశితంగా పరిశీలిస్తున్నారు.

విమానాశ్రయంలో మరింత కట్టుదిట్టం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మూడంచెల భద్రతా వలయంలోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించటంతో విజయవాడ విమానాశ్రయంలో కూడా భద్రతా వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్, ఎస్‌పీఎఫ్, స్థానిక పోలీసులు మూడంచెల విధానంలో తనిఖీలు చేపడుతున్నారు. లోపలికి వచ్చే వాహనాలను స్థానిక పోలీసులు పరిశీలిస్తుండగా.. ప్రయాణీకులను ఎస్‌పీఎఫ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఇమిగ్రేషన్, కస్టమ్స్ అధికారులు ప్రయాణికుల వివరాలను తెలుసుకుంటున్నారు. విమానాశ్రయం నుంచి షార్జాకు అంతర్జాతీయ సర్వీసులు, దేశీయంగా ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కడప, విశాఖపట్నంలకు రోజూ 50 సర్వీసుల వరకు నడుస్తున్నాయి.

ఇంద్రకీలాద్రిపై..

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవాలయం ఇంద్రకీలాద్రిపై పోలీసుల నిఘా కొనసాగుతోంది. దేవస్థానం అణువణువున ఏం జరుగుతుందో తెలుసుకోవటానికి వీలుగా సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నాయి. దేవాలయంలోకి వెళ్లే క్యూల దగ్గర పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. రాజగోపురం, చిన్న రాజగోపురం, మహామండప ప్రాంతాలతో పాటు దిగువున కనకదుర్గానగర్ తదితర ప్రాంతాలన్నింటినీ పోలీసులు జల్లెడ పడుతున్నారు.

కొండపల్లి ఆయిల్ కంపెనీల దగ్గర నిఘా

కొండపల్లిలోని కేంద్ర ఆయిల్ సంస్థలు కట్టుదిట్టపు ఏర్పాట్లు చేపట్టాయి. హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి ఆయిల్ రిఫైనరీ కంపెనీల దగ్గర పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. ప్రధాన గేట్లను మూసివేశారు. బయట నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించటంతోపాటు, సిబ్బంది గురించి కూడా పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే లోపలికి అనుమతిస్తున్నారు.

ఎన్‌టీటీపీఎస్‌లో..

రాష్ట్రంలోనే ప్రధాన విద్యుత్ కేంద్రాల్లో ఒకటైన నార్ల తాతారావు థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎన్‌టీటీపీఎస్) దగ్గర పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. సాధారణంగానే థర్మల్ ప్లాంట్‌లో ఎవరికీ అనుమతి ఉండదు. భారత్, పాక్‌ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవటంతో.. శత్రువుల లక్ష్యానికి అవకాశం ఉన్న విద్యుదుత్పత్తి ప్లాంట్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. విద్యుత్ ప్లాంట్‌లోకి ఎవరూ చొరబడకుండా చర్యలు చేపట్టారు.

దుర్గగుడి నూతన ఈవోగా

శీనా నాయక్ బాధ్యతల స్వీకారం

ఇంద్రకీలాద్రి, మే 9 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం నూతన ఈవోగా వీకే శీనా నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కుటుంబసభ్యులతో ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అర్చకులు, అధికారులు సాదరస్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో ఆశీస్సులు అందజేశారు. ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో రమేష్‌లు శేషవస్త్రం, ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..

ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వీకే శీనా నాయక్ మాట్లాడుతూ, గిరిజన సామాజికవర్గానికి చెందిన తనను ఈవోగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తనవంతు కృషితో ఆలయంలో అన్నిరకాల అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. దేవస్థానానికి వన్నె తెచ్చేలా అందరి సలహాలు, సూచనలతో ముందుకు వెళతామన్నారు. ఆలయ ప్రతిష్ఠను, గౌరవాన్ని ఇనుమడింపచేసేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

భారత సైన్యానికి స్థైర్యం ఇవ్వాలని దుర్గమ్మకు ప్రత్యేక పూజలు..

తాజాగా భారత్-పాక్ ఘర్షణల నేపథ్యంలో పాకిస్తాన్ ముష్కరుల దాడులను తిప్పికొట్టేందుకు భారత సైన్యంలో స్థైర్యం నింపేందుకు దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు శీనా నాయక్ తెలిపారు. సర్వలోకాలకు, త్రిమూర్తులకు, దేవతలకు, అందరికీ శక్తినిచ్చే జగన్మాత దుర్గమ్మ అని, అమ్మవారి అనుగ్రహాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టామని తెలిపారు. దేశ క్షేమాన్ని కోరుతూ సంకల్పం చెబుతూ ఈ పూజలు జరుగుతున్నాయన్నారు.

దుర్గగుడిలో వివిధ విభాగాల పరిశీలన

ఈవోగా బాధ్యతలు చేపట్టిన శీనా నాయక్ శుక్రవారం దుర్గగుడిపై వివిధ విభాగాలను పరిశీలించారు. తొలుత అన్నప్రసాదశాలలో భక్తులకు భోజనం వడ్డించి, అన్న ప్రసాద నాణ్యతను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందిని పిలిచి వివరాలు సేకరించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని సూచించారు. దసరా నాటికి పనులు ఏమేరకు పూర్తవుతాయన్న దానిపై ఆయన వివరాలు సేకరించారు.

శీనా నాయక్ కలెక్టర్ జి.లక్ష్మీశను ఆయన చాంబర్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం, ప్రసాదాలను కలెక్టర్‌కు అందజేశారు.

ల్యాండ్ పూలింగ్‌తో రైతులకే మేలు

- త్వరలో విధివిధానాలు వెల్లడిస్తాం: ఆర్డీవో చైతన్య
- కేతనకొండ, కాచవరం గ్రామాల్లో గ్రామసభలు
- స్పష్టమైన హామీ ఇచ్చే వరకు భూములిచ్చేది లేదు: రైతులు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో చైతన్య

ఇబ్రహీంపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ పూలింగ్ వల్ల భూములిచ్చే రైతులకు ప్రభుత్వం మేలు చేస్తుం దే తప్ప నష్టపరచదని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య అన్నారు. మండలంలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి భూసేకరణ చేయాలనుకుంటున్న కేతనకొండ, కాచవరం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో ఆర్డీవో మాట్లాడారు. రైతులు తెలిపిన అభ్యంతరాలన్నీ న్యాయమైనవే అన్నారు. అమరావతికి భూములిచ్చిన రైతులకు ఏడాదికి ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేలు కౌలు చెల్లించిందని, ప్రతి ఏడాది 10 శాతం పెంచుతుందని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీకి భూములిచ్చే రైతుల కు ప్రభుత్వం కౌలు చెల్లింస్తుందన్నారు. ఎకరా భూమి ఇచ్చిన రైతుకు 4,840 గజాల భూమిని ప్రభుత్వం అభివృద్ధి చేసి ఇస్తుందన్నారు. ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్శిటీ రావడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని వివరించారు.విధి విధానాలు త్వరలోనే స్పష్టం చేస్తామన్నారు. భూములిచ్చే రైతులకు ఏం చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వకుం డా భూములు ఇచ్చేది లేదని కొందరు రైతులు అభ్యంతరం తెలిపారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీకి సరికొత్త యాప్

మొగల్రాజపురం : ప్రజాపంపిణీ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇన్‌స్పెక్షన్ యాప్ ను తీసుకొచ్చింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ ఆదేశాల మేరకు కమిషనరేట్ అధికారులు ముత్యాల ప్రసాద్, కుమార్, ఏఎస్వో-2 శ్రీనివాసులు నగరంలో సర్కిల్-2 పరిధిలోని సత్యనారాయణపురం, చుట్టుగుంట, కృష్ణలంకలోని ఐదు రేషన్ షాపుల్లో యాప్ పనితీరును పరిశీలించారు. రేషన్‌షాపులు, ఎంఎల్‌ఎస్ పాయింట్లు, పెట్రోల్ బంకులు, గోడౌన్లు తనిఖీ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో, క్షేత్రస్థాయిలో స్టాకుకు మధ్య తేడాలు, షాపులు ఎవరు నిర్వహిస్తున్నారు వంటివి ఈ యాప్ ద్వారా తనిఖీ చేయొచ్చని అధికారి ప్రసాద్ తెలిపారు.

కోల్డ్ స్టోరేజి పరిహారంపై ఉత్కంఠ!

- నేడు బాధితులకు చెల్లింపులు
- అంతుబట్టని యాజమాన్య వైఖరి
- రైతులకు అందని సమాచారం

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)

జగ్గయ్యపేట సమీపంలో తొర్రగుంటపాలెంలో సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజి బాధితులకు యాజమాన్యం శనివారం నష్టపరిహారం చెల్లిస్తానని ఇచ్చిన హామీ అమలుపై రైతుల్లో ఉత్కంఠ రేపుతోంది. యాజమాన్యం నుంచి, అధికారుల నుంచి.. రైతులకు శుక్రవారం రాత్రివరకు ఎలాంటి సమాచారం అందకపోవటంతో ఆందోళన నెలకొంది. రెండ్రోజుల క్రితం కోల్డ్‌స్టోరేజి ముఖ్య భాగస్వాములు రావూరి శ్రీనివాసరావు, హరి నరసింహారావులు విజయవాడలో మార్కెటింగ్‌శాఖ ఏడీ మంగమ్మను కలిసి 2023, 24 సంవత్సరాల్లో మిర్చి, ఇతర అపరాల ధరలను నిర్ణయించాలని లేఖ ఇవ్వటం కలకలం రేపుతోంది. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సమక్షంలో, తహసీల్దార్ మనోహర్, సీఐ వెంకటేశ్వర్లు, ఏఎంసీ సెక్రటరి నరసింహారావుల ఆధ్వర్యంలో యాజమాన్యం గత ఏప్రిల్‌లో రైతులతో సమావేశం నిర్వహించి ఈనెల 10న రూ.2 కోట్ల మేర చెక్కులు అందజేస్తామని అంగీకరించింది. అంతకుముందు ఏఎంసీలో మిర్చి, ఇతర అపరాల ధరలను రైతులు, యాజమాన్యం కలిసి ధరలు నిర్ణయించారు. తాజాగా యాజమాన్య ప్రతినిధులు మళ్లీ మార్కెటింగ్‌శాఖ ఏడీని కలిసి ధరలు తెలియజేయాలని లేఖ ఇవ్వటం వెనుక అంతర్యం అంతుబట్టడం లేదు. రైతులు కోల్‌స్టోరేజిలో ఉంచిన సరుకు, అద్దె, వాటిపై ఇచ్చిన రుణాలకు సంబంధించి పట్టీలను తయారుచేసేందుకు నెలరోజులు గడువు కావాలని యాజమాన్యం కోరింది. మంచి ధర వస్తే అమ్ముకుందామని కోల్డ్ స్టోరేజిలో నిల్వచేసుకుంటే పంట బుగ్గి అయిందని, యాజమాన్యం సహృదయంతో పరిహారం ఇస్తామంటే నష్టమైనా అంగీకరిస్తే ఇప్పుడు మళ్లీ ధరలపై కొర్రీ పెట్టడమేమిటని ప్రశ్నిస్తున్నారు. గడువు దగ్గర పడినా యాజమాన్యం, అధికారుల నుంచి సమాచారం రావకపోవటంపై కొందరు రైతులు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను కలిసి వివరించినట్లు సమాచారం. తహసీల్దార్ మనోహర్‌ను ఈఅంశంపై ప్రశ్నించగా తమకు యాజమాన్యం నుంచి సమాచారం లేదని తెలిపారు.

గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుల పరిష్కారం

కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అధికారులను ఆదేశించారు. రాజధాని రైతుల ఫిర్యాదులను అదనపు కమిషనర్ వారికి తెలియజేశారు. లంక భూముల సమస్యను పలువురు అర్జీదారులు అధికారుల దృష్టికి తీసుకురాగా, ఈ అంశంపై గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకొంటామని అదనపు కమిషనర్ వారికి తెలియజేశారు. అదేవిధంగా జీఐఎస్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలపై అమరావతిలో రైతులు ఫిర్యాదు చేయగా, అదనపు కమిషనర్ తక్షణమే సమస్యను పరిష్కరించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరీ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కేఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, జీ.భీమారావు, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేయూ రెక్టార్‌కు అరుదైన గౌరవం

- వాషింగ్టన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జీవితకాల సభ్యత్వం



మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ(కేయూ) రెక్టార్ మండవ వెంకట బసవేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోని వాషింగ్టన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఆయనకు జీవితకాల సభ్యత్వం లభించింది. శుక్రవారం అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ అధికారులు సభ్యత్వ పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఆయన కేయూలో రెక్టార్‌గా పని చేస్తున్నారు. సైన్స్ విభాగంలో ఇప్పటివరకు 481 పరిశోధనాపత్రాలను వెలువరించారు. 54మందికి పీహెచ్‌డీ చేసేందుకు గైడ్‌గా వ్యవహరించారు. బసవే శ్వరరావు ప్రతిభను గుర్తించిన వాషింగ్టన్ అకాడమీ సభ్యత్వమిచ్చిగౌరవించింది.

కృష్ణా తీరంలో గస్తీ ముమ్మరం : ఎస్పీ

మచిలీపట్నం టౌన్ : జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లకుండా ప్రజాజీవనానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా వ్యాప్తంగా పటిష్ఠ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎస్పీ గంగాధరరావు గిలకలదిండి సముద్ర తీర ప్రాంతాన్ని సందర్శించి, ఫిషింగ్ హార్బర్ నుండి పడవ ద్వారా మెరైన్ పోలీసులతో కలసి మొగ వరకు వెళ్లి రక్షణా పరిస్థితులను పరిశీలించారు. మెరైన్ స్టేషన్ పరిశీలించారు. గిలకలదిండి, వర్లగొంది తిప్ప, పోలాటితిప్ప పరిసర ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్‌కు దరఖాస్తులు

పామర్రు: మెగా డీఎస్సీ-2025 పరీక్షలకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ పొం దేందుకు టెట్ అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల నుంచి మరోసారి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత జిల్లా అధికారి జి.రమేష్ శుక్రవారం విలేకరులకు వివరించారు. విద్యార్హత, కు ల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, టెట్ మార్కుల జాబితాల జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారులు గుడివాడ 94408 63241, అవనిగడ్డ 63018 69360, మచిలీపట్నం 98662 56850 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు.

జాషువాకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి

- ఏసీబీ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ యజమాని నుంచి అక్రమంగా సొమ్ము వసూలు చేశారంటూ నమోదైన కేసులో ఐపీఎస్ అధికారి జాషువాకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3)(సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ))కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఏసీబీ అధికారులను హైకోర్టులో ఆదేశించింది. ఈ సందర్భంగా పిటిషనర్‌కు పలు షరతులు విధించింది. దర్యాప్తుకు సహకరించాలని, కేసుకు సంబంధించి విషయాలను పబ్లిక్‌గా మాట్లాడవద్దని స్పష్టం చేసింది. వారం రోజుల్లో నివాస వివరాలను అఫిడవిట్ రూపంలో దర్యాప్తు అధికారికి అందజేయాలని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి జాషువా ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం

అమరావతి రైల్వే లైను నిర్మాణానికి ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల్లో భూముల సర్వే, పెగ్ మార్కింగ్ పూర్తి

- భూములిచ్చేందుకు దాదాపు రైతులందరూ అంగీకారం
- తుది నోటిఫికేషన్ విడుదలకు అధికారుల కసరత్తు

రాజధాని అమరావతి రైల్వే లైను నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రైల్వే లైను కోసం ఎనిమిది మండలాల్లోని 22 గ్రామాల్లో అధికారులు భూమిని సేకరిస్తున్నారు. రైల్వే ట్రాక్ వెళ్లే మార్గంలో ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని 12 గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఈ రెండు జిల్లాల్లో భూముల సర్వే పూర్తయింది. 12 గ్రామాల పరిధిలో ట్రాక్ నిర్మాణానికి కావాల్సిన భూమిని అధికారులు గుర్తించి, లెక్కించి పెగ్ మార్కింగ్ కూడా వేశారు. రైతుల నుంచి చెప్పుకోదగిన అభ్యంతరాలు లేకపోవడంతో గ్రామాల వారీగా భూసేకరణకు కొద్ది రోజుల్లో తుది నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నామని రెవెన్యూ అధికారి ఒకరు పేర్కొన్నారు. భూములు కోల్పోతు న్న రైతులకు త్వరలో రైల్వే శాఖ పరిహారం చెల్లిస్తుందని తెలిపారు.



వీరులపాడు మండలం చెన్నారావుపాలెంలో పెగ్ మార్కింగ్ చేస్తున్న రెవెన్యూ, రైల్వే అధికారులు


(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

సీఎం చంద్రబాబునాయుడు చొరవ వల్ల నవ్యాంధ్ర రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కొత్త రైల్వే లైను మంజూరు చేసిన సంగతి విదితమే. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి రాజధాని మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు కొత్త లైను ఏర్పాటు చేయనున్నారు. కొత్త రైల్వేలైను మొత్తం 56.53 కిలోమీటర్లు ఉండగా, ట్రాక్, రైల్వే స్టేషన్ల నిర్మాణం కోసం 892 ఎకరాల భూమి అవసరం. గుంటూరు జిల్లాలో 199.20 ఎకరాలు, పల్నాడు జిల్లాలో 333.95 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 334.62 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 24.24 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వ భూమి 98.20 ఎకరాలు, ఈనాం భూములు 52.01 ఎకరాలు, ప్రైవేట్ భూములు 741.80 ఎకరాలు ఉన్నట్టుగా అధికారులు లెక్కించారు. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో 297 ఎకరాలకు సంబంధించి భూసేకరణ విషయంలో రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. భూములిచ్చేందుకు దాదాపుగా రైతులందరూ అంగీకరించారు. తమకు పరిహారంతో పాటుగా ఉపాధి కూడా చూపాలని 30 మంది రైతులు మాత్రం అధికారులకు విన్నవించారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రైల్వే లైను వెళ్లే గ్రామాలు

- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో ఎర్రుపాలెం, కేసీరెడ్డిపల్లి
- ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలో గూడెం మాధవరం, పెద్దాపురం, అల్లూరు, చెన్నారావుపాలెం, జుజ్జూరు, నరసింహారావుపాలెం
- కంచికచర్ల మండలంలో గొట్టుముక్కల, పరిటాల
- ఇబ్రహీంపట్నం మండలంలో చిలుకూరు, దాములూరు
- పల్నాడుజిల్లా అమరావతి మండలంలో వైకుంఠపురం, యంద్రాయి, కర్లపూడి
- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో వడ్డమాను, మోతడక
- తాడికొండ మండలంలో పెదపరిమి, తాడికొండ, కంతేరు
- పెదకాకాని మండలంలో పెదకాకాని, కొప్పురావూరు

Rail connectivity to Amravati, capital of Andhra Pradesh



అమరావతి రైల్వే లైను మ్యాప్

పల్నాడు, గుంటూరు జిల్లాలో ఆలస్యం

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో భూసేకరణ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అక్కడి రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రావటం లేదు. రైతుల అభ్యంతరం వల్ల సేకరణ విషయంలో అధికారులు ముందడుగు వేయటానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు 27 కిలోమీటర్ల ట్రాక్

మొత్తం 56.53 కిలోమీటర్ల రైల్వే లైనుకు సంబంధించి మొదటి దశలో ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు 27 కిలోమీటర్ల మేర ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. నదిపై 3.2 కిలోమీటర్ల మేర వంతెన నిర్మించనున్నారు. మూడు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెబుతుండగా, సీఎం చంద్రబాబునాయుడు మాత్రం రెండేళ్లలో పూర్తి చేయాలని గట్టిగా పట్టుపడుతున్నారు. ట్రాక్ నిర్మాణ పనులు రెండేళ్లలో పూర్తవుతాయని, కృష్ణానదిపై వం తెన నిర్మాణానికి మూడేళ్లు పడుతుందని రైల్వే అధికారులు అంటున్నారు. మొ త్తం ప్రాజెక్టు వ్యయం రూ.2,047 కోట్లు. ఆ మొత్తం కేంద్ర ప్రభుత్వం భరిస్తోం ది. మొదటి దశలో 27 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణానికి రూ.450 కోట్లు, 3.2 కిలోమీటర్ల వంతెనకు రూ.350 కోట్లు ఖర్చు అవుతాయని ప్రాథమిక అంచనా. ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో టెండర్లు పిలిచేందుకు రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహికవ్రతం నిర్వహించారు. అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యుల పర్యవేక్షణలో 25 మంది భక్తులు వ్రతంలో పాల్గొన్నారు. దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు వ్రతంలో పాల్గొన్న వారికి పూజాసామాగ్రిని అందజేశారు. లోకరక్షణార్థం దేవస్థానం వద్ద మే 12న సుదర్శన యజ్ఞం నిర్వహించనున్నట్టు నిర్వహకులు తెలిపారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బాపులపాడు గ్రామసభలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరిం చేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ వారివద్ద నుంచి అర్జీలను, దరఖాస్తులను స్వీకరించారు. ఎంఎన్‌కే రహదారి నుంచి రంగయ్యప్పారావుపేట ప్రధాన రహదారి పనులు మార్చి నెలాఖరుకే పూర్తి కావాలసి ఉండగా సంబంధిత కాంట్రాక్టర్ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, నిరుపయోగంగా ఉన్న భవనంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అదే విధంగా 5 గ్రామాల ముంపు కారణమవుతున్న చేపల చెరువు తవ్వకాలను నిలిపివేయాలని ఎమ్మెల్యేను కోరారు. బాపులపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన గల రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరగా తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మల్లవల్లి రహదారి మరమ్మతులు, సింగన్నగూడెం వద్ద గల ఎట్టివాగుపై శిథిలావస్థకు చేరిన వంతెన నిర్మాణం తదితర సామాజిక సమస్యలపై ఆయా గ్రామస్తులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి చేయడంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యమన్నారు. జాతీయ రహదారిపై కృష్ణాజిల్లా ముఖద్వారమైన బొమ్ములూరు నుంచి గ్రీనరీ పెంచేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు వివరించారు. బాపులపాడు మండలంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను పార్టీలతీతంగా సత్వరం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. బాపులపాడులోని ఎస్సీ కాలనీలో, ఇందిరానగర్‌లో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు, విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు, జనసేన నియోజక వర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, మాజీ జెడ్పీటీసీ సుంకర బోస్, ఏఎంసీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయికళ్యాణి, వేములపల్లి శ్రీనివాసరావు, దయాల రాజేశ్వరావు, పుట్టా సురేష్, గూడవల్లి నరసయ్య, దుట్టా శివన్నారాయణ, గుండపనేని ఉమా వరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు

ప్రతి గ్రామంలోనూ గ్రామసభ నిర్వహిస్తా

గ్రామసభలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి అర్జీలను ఇచ్చేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఆయన కల్పించుకుని వివిధ సమస్యలపై ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయించారు. వ్యక్తిగత పెన్షన్లు, ఇళ్ల స్థలాలపై ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేక కౌంటర్లను పర్యవేక్షించారు. వివిధ గ్రామాల్లోని సమస్యలపై కొన్నింటికి పరిష్కరించేందుకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేయగా, మరికొన్నింటిపై అధికారులను కార్యా చరణ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అర్జీలిచ్చేందుకు ప్రజలు రాత్రయినా వేచి ఉండటంతో ప్రతి గ్రామంలోను గ్రామసభ నిర్వహించే విధంగా త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు.

విద్యుత్‌శాఖ విస్తృత తనిఖీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి విద్యుత్ సెక్షన్ పరిధి లోని 14 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుడివాడ డివిజన్ ఈఈ జి.బి. శ్రీనివాసరావు, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, హనుమాన్‌జంక్షన్ డిప్యూటీ ఈఈ బిశ్రీనివాసరావు ఆధ్వర్యంలో 41 బృందాలుగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వివిధ గ్రామాల్లోని 2685 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయగా 286 గృహాలు అనుమతి ఉన్న లోడ్ కంటే అధికంగా వాడుతున్నట్లు గుర్తించడం జరిగిందని, వారికి లోడ్ క్రమద్ధీక రణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి ఏఈ యు. మురళీకృష్ణ, గుడివాడ డివిజన్‌లోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్‌జంక్షన్ అభయాంజనే యస్వామి దేవస్థాన పాలకమండలి నియామకానికి దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలిలో నియామకానికి 20 రోజుల్లోగా దేవదాయ ధర్మాదాయశాఖ నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. దేవదాయ ధర్మాదాయశాఖ నందుగల నిబంధనలతో కూడిన నమూనా ఫారం-2 ద్వారా పూరించిన దరఖాస్తుల ను డిస్ట్రిక్ట్ ఎండోమెంట్ ఆఫీసర్, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, ఏలూరు వారికి అందజేయాలని కార్యనిర్వహణాధికారి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు.

ఉపాధి శ్రామికుడు మృతి

ఉయ్యూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : బోళ్లపాడులో ఉపాధిహామీ శ్రామికుడు బాణావత్ వాలీ నాయక్ (69) గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పంటబోదె తవ్వకం పనికి శుక్రవారం తోటి శ్రామికులతో కలసి వెళ్లి పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సహచర కూలీలు అధికారులకు సమాచారం తెలియజేసి అతనిని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు వాలీ నాయక్ మృతదేహాన్ని సందర్శించి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తానని తెలియజేశారు.



ఉయ్యూరు మసీదు సెంటర్ సమీపాన బైక్‌పై పడిన చెట్టు

చెట్టు కూలి బైక్ ధ్వంసం

ఉయ్యూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు పెద్ద మసీదు సెంటర్ సమీపాన గురజాడ డొంకరోడ్డులో చెట్టుకూలి బైక్‌పై పడగా త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏవీహెచ్ ప్రకాశ్‌బాబు ఇంటి నుంచి బైక్‌పై వస్తుండగా రచ్చబండ వద్ద ఉన్న పెద్ద చెట్టు ఒక్కసారిగా కూలి బైక్‌పై పడింది. బైక్‌పై ఉన్న ప్రకాశ్‌బాబు త్రుటిలో తప్పించుకోగా స్వల్ప గాయాలయ్యాయి. చెట్టుకింద పడి బైక్ ధ్వంసమైంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉంగుటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు విద్యుత్‌సెక్షన్ పరిధిలో 33/11కేవీ నందమూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అనగాని నాగేశ్వరరావు తెలిపారు. ఇందుపల్లి, వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మదిరపాడు తదితర గ్రామాల్లో మూడు గంటలపాటు కరెంట్ వుండదని, వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.



ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

● బస్సు డ్రైవర్‌కు గాయాలు
● చెత్త డంపింగ్ పొగతో రోడ్డు కనిపించక జరిగిన ప్రమాదం

కంకిపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలూరు - గన్నవరం రోడ్డులో బుడమేరు వంతెన సమీపంలో డంపింగ్ యార్డ్ ఉంది. ఈ డంపింగ్ యార్డ్‌లో ఉప్పలూరు గ్రామ పరిధిలోని పరిసర ప్రాంతాలకు చెందిన కళ్యాణ మండప నిర్వాహకులు కళ్యాణ వేడుకల సందర్భంగా వచ్చిన చెత్తను రోడ్డు మార్జిన్‌లో వేసి శుక్రవారం మధ్యాహ్నం నిప్పంటించారు. దీంతో దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో గన్నవరం వైపు నుంచి కంకిపాడు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, ఉప్పలూరు నుంచి గన్నవరం వైపు వెళ్తున్న లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కంకిపాడు ఎస్సై అనీల్, పోలీసు సిబ్బంది, ఆర్టీసీ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, ఉప్పలూరు సర్పంచ్ సురేష్ ఈవో వెంకటేశ్వరరావులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయాలపాలైన నారాయణను ఆసుపత్రికి తరలించారు. ఎగసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

నేడు ఆత్కూరులో పీఎం సూర్యఘర్ మేళా

ఉంగుటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై పడుతున్న విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలనే సదుద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని మండలంలోని గృహ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సత్యకుమార్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో నూరుశాతం సౌరశక్తి కలిగిన ఆదర్శ గ్రామంగా ఆత్కూరును ఎంపిక చేశారని, శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో పీఎం సూర్యఘర్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు

కేంద్ర విధానాలతో నష్టపోతున్న కార్మికులు

గన్నవరం, మే 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు కళ్లం వెంకటే శ్వరరావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఈ నెల 20న లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని చేయనున్న కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. పోరాటాల్లోనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్మికులందరిని సమ్మెలో పాల్గొనేలా గేట్ మీటింగ్‌లు పెట్టి చెప్పాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి, కళ్లం రాంబాబు, బడుగు మరియదాసు, మల్లంపల్లి లలితకుమారి, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు జాబ్‌కార్డు అందజేస్తున్న ఎంపీపీ యరగొర్ల నగేష్

ఉపాధి పథకంతో గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటునకు ఉపాధిహామీ పథకం ఉపయోగపడుతుందని ఎంపీపీ యరగొర్ల నగేష్ అన్నారు. కాకులపాడులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన 70 మంది ఉపాధిహామీ కూలీలకు జాబ్‌కార్డులను ఏపీవో అశోక్‌కుమార్, టీడీపీ నాయకుడు చలసాని శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. కొంతమందికి జాబ్‌కార్డులు అందలేదని కూలీలు ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామీణ కుటుంబాల నుంచి పని చేయగలిగేవారు దరఖాస్తు చేసుకున్న 15రోజుల్లో జాబ్‌కార్డుతో కూడిన పని పొందవచ్చని, త్వరలోనే జాబ్‌కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పడకల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ సత్తా అబ్రహాం తదతరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న ముస్లింలు

యనమలకుదురులో జాతీయ జెండా ప్రదర్శన

పెనమలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏ శత్రుదేశంతోనైనా యుద్ధం చేయాల్సి వస్తే ముందు వరుసలో తాముంటామంటూ యనమలకుదురులో ముస్లింలు దేశభక్తి నినాదాలు చేశారు. పహల్గాం ముష్కరుల దాడులతో పాకిస్తాన్, భారత్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో యనమలకుదురులోని ఫైజ్ మసీదు వద్ద ముస్లింలు జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ హిందుస్థాన్ జిందాబాద్, భారతసైన్యం జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు.



బాపులపాడులో కొవ్వొత్తులతో ర్యాలీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : దేశభద్రతకు ప్రాణాలను పణంగా పెట్టిపోరాటం చేస్తూ అశువులు బాసిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని మరువలేమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడులో శుక్రవారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహిస్తూ డౌన్ డౌన్ పాకిస్తాన్ అంటూ నినదించారు. మురళీనాయక్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.




కేసరపల్లి అంగన్వాడీలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగపద్మావతి.. బోళ్లపాడు వెల్‌నెస్ సెంటర్‌లో..

పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం

గన్నవరం, మే 9 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్‌వి నాగపద్మావతి అన్నారు. మండలంలోని కేసరపల్లి అంగన్వాడీ సెంటర్‌లో కిశోరి వికాసం వేసవి శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాగపద్మావతి మాట్లాడుతూ కిశోరి వికాసం ప్రత్యేక కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి ప్రేమ, దివ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు : బాల్యవివాహాలవల్ల కలిగే దుష్ప్రభావాలు, బాలికల సంపూర్ణ ఆరోగ్యం, లైంగిక వేధింపుల నివారణపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బోళ్లపాడు వెల్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త ఇందిరా, జయ చిత్ర తదితరులు పాల్గొన్నారు. కాటూరు 1, 2 సచివాలయాల్లో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు.

ఉంగుటూరు : కౌమార బాలికలు, యువతుల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాస కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ పెదఅవుటపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి అన్నారు. శుక్రవారం తేలప్రోలులో 1, 7 అంగన్వాడీ కేం ద్రాల్లో నిర్వహించిన కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షక కార్యదర్శి జి.కామాక్షి, ఏఎన్ఎం, మల్లీశ్వరి, వీఓఏలు రమాదేవి, ఇందుమతి, అంగన్వాడీ టీచర్లు కల్పన, సుభాషిణి పాల్గొన్నారు.

ఉత్కంఠగా టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు

● ఐదు గ్రామాలకు అధ్యక్షుల ఎన్నిక

కంకిపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నికలు ఉత్కంఠగా సాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో కమిటీలు ఏకగ్రీవం అవుతుండగా మరి కొన్ని గ్రామాల్లో వాయిదా పడుతున్నాయి. శుక్రవారం పెనమలూరు మండలం గోసాల అధ్యక్షుడిగా షేక్ మాబూ సుబాని, ప్రధాన కార్యదర్శిగా ఎందువ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా తాటి శివ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కోనేరు సత్యనారాయణ, కాంద్రు సరిత, ఎస్‌కె. జోజి, కార్యదర్శులుగా శివశంకర్, నాగప్రమీల, పడుగు వెంకటప్పయ్య, కోశాధికారిగా వణుకూరు రాఘవేంద్రరావులు ఎన్నికయ్యారు. పరిశీలకులుగా కోయా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు మండలంలోని గొల్లగూడెం అధ్యక్షుడిగా పిల్లి కుమార్ బాబు, ప్రధాన కార్యదర్శిగా దేవరపల్లి సుధాకర్, కోలవెన్ను అధ్యక్షుడిగా బొబ్బ శ్రీనివాసరావు, ఉప్పలూరు అధ్యక్షుడిగా చలసాని రాధాకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పోతురాజు కొండలరావు, వేల్పూరు అధ్యక్షుడిగా చీలి అజయ్, ప్రధాన కార్యదర్శిగా మోకా వరుణ్, ఎన్నుకున్నారు. పరిశీలకులుగా టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, మండల పార్టీ అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, కొండవీటి శియ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ గోసాల గ్రామ అధ్యక్షుడిగా మాబు సుబాని తదితరులు

పునాదిపాడులో వాయిదా..

మండలంలోని పునాదిపాడు గ్రామ పార్టీ ఎన్నికలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మునిబోయిన బాబు, సంజీవరావులు అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. గ్రామంలో సుమారు 1500 ఓటు బ్యాంక్ ఉన్న వడ్డెర కులానికి చెందిన సంజీవరావుకు గ్రామ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆ కులానికి చెందిన వారు పట్టుబట్టారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరిశీలకులుగా వచ్చిన మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తుమ్మలపల్లి హరికృష్ణలు ఇరు వర్గాలను సముదాయించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని సూచించారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

ఘనంగా రేణుకా అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కూచిపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): వేములమడలోని రేణుకా అంకమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సత్కరించారు. రామలింగేశ్వరరావు, వీరేంద్ర, సర్పంచ్ సీతారామయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, వీరంకి తులసీ దాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈ నెల 15న ఉరుసు

గుడివాడరూరల్ : సయ్యద్ సాలార్‌షా ఔలియా ఖాదరీ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ముజావర్ యాకూబ్ బేగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎంలు

చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

పామర్రు, మే 9(ఆంధ్రజ్యోతి): అంగన్వాడి చిన్నారుల సమగ్ర అభివృద్ధితోపాటు, నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.సత్యశ్రీ పేర్కొన్నారు. పూర్వ బాల్యదశ సంరక్షణ (ఎర్లీచైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ వేడుకను స్థానిక చాట్లవానిపురం, కొబ్బరితోట అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పోషకాహారం సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజంలో భాగస్వాములుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, చాట్ల సుజాత, వెంకట లక్ష్మి, నాంచారమ్మ, ఏఎన్ఎం విజయభాను ఆశా వర్కర్ కమల, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 9(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 29వ వార్డు సచివాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ ఆర్థిక పరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నానన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు వార్డుల్లోని డ్రెయినేజీ సమస్యలను గుర్తించామన్నారు. ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు రాంబాబు, శొంఠి రామకృష్ణ, సాంబశివరావు, ఉమా, సుబ్రహ్మణ్యం, సీతారాం, నాగరాజు, రామదేను వేణుబాబు, ఆదినారాయణ, సుభాషిణి, పాల్గొన్నారు.

గుడివాడ మండలం బొమ్ములూరులో ప్రమాదావశాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గాయపడిన వృద్ధురాలిని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదుకున్నారు. శుక్రవారం విన్నకోటలో ట్రాక్టర్ బోల్తా ప్రమాద బాధితులను పరామర్శించేందుకు వెళుతూ మార్గంమధ్యలో ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్రగాయాలపాలైన పెదలింగాలకు చెందిన అచ్చమ్మ అనే వృద్ధురాలిని స్వయంగా తన కారులో వ్యక్తిగత సిబ్బంది నిచ్చి ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విన్నకోట పర్యటన ముగించుకుని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రభుత్వాసుపత్రికి చేరుకుని వృద్ధురాలిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్‌వచ్చే వరకు వేచి ఉంటే వృద్ధురాలు పరిస్థితి విషమంగా ఉండేదని, అడక్కుండానే సహాయం చేసిన ఎమ్మెల్యే వెనిగండ్లను ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న వెనిగండ్ల

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

●కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు

గుడివాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు సమగ్ర చట్టం లేకపోవడం, భూయజమాని సంతకం నిబంధన పెట్టడం వల్ల కౌలు వాస్తవ సాగుదారులైన రైతులకు కౌలు గుర్తింపు కార్డులు రావడం లేదని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మికవర్గ సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరసనను తెలియజేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కౌలు రైతు సంఘం నాయకులు సాయన రాజేంద్రప్రసాద్, రైతు సంఘం నాయకులు మసిముక్కు సత్యనారాయణ, సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, సీఐటీయు నాయకులు రేపాని కొండ, పట్టణ కార్యదర్శి పి.రజిని, జ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలపక్ష రైతు సంఘాల నేతలు

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

పామర్రు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి పామర్రులోని శివాలయంలో తాడిశెట్టి పూర్ణయ్య, నాగేశ్వరరావు వంశీయుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన హరిహర పుత్రుడు అయప్పస్వామి నూతన ఆలయ విగ్రహ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తునట్టు ఆలయ నిర్వహకులు తాడిశెట్టి సాంబశివరావు శుక్రవారం తెలిపారు. 12న ఉదయం గోపూజ, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. 22న నిత్యహోమం, అయప్ప జప హోమం నిర్వహించనున్నామన్నారు. 23న మహా సుదర్శన హోమం, ఫలాదివాసం, ఆలయ శిఖరప్రతిష్ఠ, స్వామివిగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం 15వేల మందికి మహా అన్నదానం చేయనున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరితోపాటు ఇతర అతిరథ మహారథులు హాజరు కానున్నారు. కార్యక్రమంలో చంటి సత్యనారాయణ, మధుశేఖర్, అన్నదాన కమీటి ఛైర్మన్ వల్లూరిపల్లి చక్రవర్తి, బోగ్గవరపు సాయిబాబు, మాగంటి నాని, కాకర్ల శివశంకర్, స్వర్ణశివ, ఫణి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠ మహోత్సవానికి సిద్ధమవుతున్న ఆలయం

రెండు మోటారు సైకిళ్లు చోరీ

గుడివాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్లు చోరీకి గురైన సంఘటన స్థానిక రైతుబజారు వద్ద చోటుచేసుకుంది. సత్యనారాయణపురానికి చెందిన నిమ్మగడ్డ సనత్‌కుమార్, గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన పడమట శ్రీనులు రైతుబజారులో కూరగాయాలు కొనుగోలు చేసేందుకు వాచ్చరు. ఈ నేపథ్యంలో తమ ద్విచక్రవాహనాలకు తాళం వేసి రైతు బజారు వద్ద పార్కు చేసి వెళ్లారు. కూరగాయలు కొనుగోలు చేసుకుని తిరిగి వచ్చి చూడగా రెండు బైక్‌లు కన్పించలేదు. దీంతో వారు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారరు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

గుడ్లవల్లేరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : విన్నకోట ట్రాక్టర్ ప్రమాద మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. గురువారం విన్నకోట గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన అరుణ్ బాబు, అభిషేక్‌ల మృతదేహాలను శుక్రవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. బాధితుల కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా వచ్చే సహాయం ఉంటే తప్పక వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రమాదంలో తీవ్రగాయాలైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. డీసీ ఛైర్మన్ పాలేటి ఆంజనేయులు, గుడ్లవల్లేరు ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, ఎ.రామ్మోహనరావు, ఎ.రాము, కోటప్రోలు ఆదినారాయణ, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు, బెజవాడ కిషోర్ తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వైసీపీ నాయకులు కోటప్రోలు నాగు, శాయిన రవికుమార్, పాలేటి చంటి తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.



అరుణ్, అభిషేక్‌ల మృతదేహాలను సందర్శించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గుడివాడ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : చౌటపల్లికి చెందిన కోసనం వరుణ్ తేజ్ (18) ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు. గత నె ల 21వ తేదీన చౌటపల్లికి చెందిన కోసనం వరుణ్ తేజ్ గుడివాడ నుంచి తెల్లవారుజామున బైక్‌పై చౌటపల్లి వెళ్తుండగా, మల్లాయిపాలేం శ్యామలాంబ రైసు మిల్లు వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొన్నాడు. దీంతో తీవ్ర గాయాలవడంతో విజయవాడ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో అతడు చికిత్స పొందుతూ విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించినట్టు ఎస్సై తెలిపారు. పంచనామా నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మండల సమావేశం వాయిదా

గుడివాడ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మెజార్టీ సభ్యులు రాకపోవటంతో మండల సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ తెలిపారు. గుడివాడ రూరల్ మండల సమావేశం శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కాగా, 11 గంటల వరకు మండల సమావేశానికి ఎంపీటీసీలు మూడు వంతులు రావాల్సి ఉండగా, ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కోరం లేకపోవటంతో సమావేశం వాయిదా వేసి త దుపరి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు. పహల్గామ్ దాడిలో మర ణించిన, యుద్ధంలో మరణించిన వీర జవాన్లకు రెండు నిముషాలు ఎంపీటీసీలు, ఏఈలు, సర్పంచ్‌లు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు చాలా తక్కువ మంది హాజరయ్యారు. కార్యదర్శులు ఇద్దరే హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు కొంతమంది మండల సమావేశం వైపే రాలేదు. మండల సమావేశానికి అధికారులు, కార్యదర్శులు రాకపోవటంతో వెలవెలబోయింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణు ప్రసాద్

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గుడివాడ, మే 9(ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండటంతో ఈ నెల 10వ తేదీ ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ, రాజేంద్రనగర్, టీటీడీ కల్యాణమండపం రోడ్డు, డీఎస్పీ కార్యాలయం రోడ్డులలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. గృహ, పరిశ్రమల, వాణిజ్య వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో శుక్రవారం దాదాపు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని కౌతవరం సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి జేఈ వర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అన్నవరం, పామర్రు విద్యుత్ లైన్లపై పిడుగు పడటం వల్ల ఇన్‌స్వలేటర్లు కాలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం 6 గంటలకు పెడన నుంచి విద్యుత్‌ను సరఫరా చేశారు. రెండు లైన్లలో ఒకేసారి ఇన్‌స్వలేటర్లు కాలిపోయాయి. వర్షం తగ్గగానే విద్యుత్ సిబ్బంది వాటిని మార్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపధికన పనిచేశారని జేఈ వెల్లడించారు.

ఈ నెల 20 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

గుడివాడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ వైశాఖ బహుళ అష్టమి నుంచి 22వ తేదీ వైశాఖ బహుళ దశమి వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభిస్తారన్నారు. 20వ తేదీ ఉత్సవాల తొలి రోజు గోపూజ, పంచామృత అభిషేకాలు, సాయంత్రం అరుణాచలేశ్వరా నాట్య నిలయం, గుడివాడ వారి ఆధ్వర్యంలో పీతా అనూషా బృందం వారిచే కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. 21వ తేదీ తమలపాకుల అర్చన, సాయంత్రం బి.రమాదేవి, భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. చివరి రోజు హనుమజ్జయంతి సందర్భంగా సింధూర అర్చన, రాత్రికి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త తుమ్మలపల్లి పరేష్, ఛాయ దంపతులచే శ్రీసీతారాముల శాంతి కల్యాణం నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న అరుణ కుమారి

పెదపారుపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి తెలిపారు. ఈదులమద్దాలి గ్రామంలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమం సూపర్‌వైజర్ అరుణ కుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టిన రెండేళ్ల వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి పిల్లలను తీసుకొచ్చి ఎత్తు, బరువు తీయించి ఎలా ఉన్నారో, వారి ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్.ఎస్.కె .నాగలక్ష్మి, మహిళా పోలీసు పి.నాగలక్ష్మి, ఏఎన్ఎం వాణి, తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : చిన్నతనంలోనే బాలికలకు వివాహాలు చేయడం వల్ల అనేక దుష్ప్రభావాలు ఎదుర్కొవలసి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా, ఎంఎస్‌కే స్రవంతి అన్నారు. పమిడిముక్కల అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలిక వికాసం - వేసవి సెలవుల కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

నందివాడ : కిశోర వికాసం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదవిరివాడ అంగన్వాడీ కేంద్రం వద్ద అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగ శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం పునరుత్పత్తి ఆరోగ్యం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలుపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో గర్భధారణ వల్ల మాతా మరియు శిశు మరణాలకు, ఇతర ప్రమాదాలకు దారి తీస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లలితా రాణి, అంగన్వాడీ కార్యకర్తలు ఐ.నిర్మల, కె.జ్ఞానేశ్వరి, బాలికలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషా



ముక్కుపుడక అందజేస్తున్న శ్రీనివాసరావు

బంగారు ముక్కుపుడక బహూకరణ

కూచిపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారికి ఆకుల శ్రీనివాసరావు - శివస్వప్న దంపతులు బంగారపు ముక్కుపుడకను ఆలయ అర్చకులు పెనుమూడి చంద్రశేఖర శర్మకు శుక్రవారం అందజేశారు. దాత కుటుంబసభ్యులు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం నేడు

గుడివాడ, మే 9(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10వ తేదీన లయన్స్ కంటి ఆసుపత్రి, బొమ్ములూరు ఆధ్వర్యంలో స్థానిక ముబారక్ సెంటర్, సయ్యద్ హన్ను ఇంటి వద్ద ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ సయ్యద్ జబీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంప్యూటర్‌పై ఉచితంగా పరీక్షలు నిర్వహించి, శుక్లాల ఆపరేషన్‌లను ఉచితంగా చేస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

ఉపాధి పనులు ప్రారంభం

గూడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల అభివృద్ధిలో ఉపాధి శ్రామికుల పాత్ర ఎంతో కీలకమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు పంపుల చెరువు వద్ద శుక్రవారం ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన స్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



హంసలదీవి పుష్కర ఘాట్ వద్ద జలయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

సురక్షిత కృష్ణానదిని భావితరాలకు అందిద్దాం

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కోడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి కృష్ణానది పుష్కరఘాట్ వద్ద నుంచి కృష్ణానది జన్మస్థలమైన మహారాష్ట్ర మహాబలేశ్వరం వరకు జరుగు కృష్ణానది జలయాత్రను శుక్రవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. కృష్ణానది అనేక వ్యర్థాలతో కాలుష్య భరితంగా మారుతుందన్నారు. కృష్ణానదిని కాలుష్యం, ఆక్రమణల నుంచి కాపాడి సురక్షితమైన కృష్ణానదిని భావితరాలకు అందించాలని జాతీయ జల విరాధూరి, జనసేన పర్యావరణ విభాగ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో అనుములు గాంధీ, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, మర్రే గంగయ్య, కోట రాంబాబు, బడే భావన్నారాయణ, పూతబోయిన సాయిబాబు, కాగిత రామారావు, నీటి సంఘాల అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధజయంతిని విజయవంతం చేయండి

ఘంటసాల : ఈ నెల 12వ తేదీన ఘంటసాలలో జరిగే బుద్ధ జయంతి మహోత్సవ నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఘంటసాలలో ఉన్న శయన బుద్ధ ప్రాజెక్టును భాషా, సాంస్కృతిక శాఖ సంచాకులు రేగుళ్ల మల్లిఖార్జునరావుతో కలసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో లభించిన బౌద్ధ విగ్రహాలు ఘంటసాల మ్యూజియంలో భద్రపరిచారన్నారు. బుద్ధ జయంతి వేడుకల సందర్భంగా ఘంటసాలలోని శయన బుద్ధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బౌద్ధ సాహితీ, చారిత్రక సదస్సు, గౌతమ బుద్ధుని నృత్య రూపకం, బుద్ధ చరిత్రపై ప్రత్యేక ఆర్ట్ క్యాంప్ నిర్వహించనున్నామన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి : ఏపీటీఎఫ్



మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మచిలీపట్నం టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ రామారావు మాట్లాడుతూ 1, 2 తరగతులు హైస్కూల్‌లో కలపడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి సాంబశివరావు , రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షురాలు కె. నాగ సోమేశ్వరమ్మ, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి కె. సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.

ప్రభుత్వానికి పోస్టు కార్డులు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 57ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని 2003 ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కె.ఐ. శ్రీనాథ్, తమ్ము నాగరాజు, అబ్దుల్ నయీమ్‌లు ఆరోపించారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన డీఎస్సీ 2003 ఫోరం సమావేశంలో ఉమ్మడి కృష్ణాజిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ శ్రీనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 57 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన ప్రతి ఒక్కరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి అర్హులందరికీ పాత పెన్షన్ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. స్టేట్ కన్వీనర్ తమ్ము నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి పోస్టు కార్డు ఉద్యమం ద్వారా తమ సమస్య తీవ్రతను తెలియచేయాలని కోరారు. అనంతరం కృష్ణాజిల్లా నూతన కన్వీనర్లుగా కె. రమేష్, అషహర్ రుషిది, బి. శ్రీనివాసరావు, జి. జయరాజు, టి. మహిపాల్, రమీజున్నీసాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంకుమార్, మల్లిఖార్జున్, సత్యనారాయణమూర్తి, శివాజీ, విశ్వనాథ్, నాగేశ్వరరావు, హబీబ్, తమ్ము వెంకటేశ్వరరావు, డి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా కుమిద్దీన్ సింగ్

మచిలీపట్నం టౌన్ : సమగ్ర శిక్ష కృష్ణాజిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా శుక్రవారం నూతనంగా ఆర్ కుమిద్దీన్ సింగ్ బాధ్యతలు తీసుకున్నారు. వారిని ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ జిల్లా యూనియన్ తరఫున మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా అధికారిని కలసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు దేవేందర్‌రావు, జిల్లా సలహాదారులు శేషుబాబు, జిల్లా నాయకులు సుజాత తదితరులు ఉన్నారు

అపరిచితులను నమ్మి మోసపోవద్దు

పెడన, మే 9 (ఆంధ్రజ్యోతి) : అపరిచితులను నమ్మి మోసపోవద్దని ఐసీడీఎస్ సీడీపీవో ఎం. సముద్రవేణి పేర్కొన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెడన మున్సిపల్ కార్యాలయంలో కిశోర బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పవల్లి, అంగన్వాడీ టీచర్లు కృష్ణకుమారి, షకీలాబేగం, భారతి తదితరులు పాల్గొన్నారు.



వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

మచిలీపట్నం టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : యుద్ధంలో దేశం కోసం వీర మరణం పొందిన వీరజవాన్ మురళీ నాయక్ మృతి జాతి మరిచిపోలేదని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. ఆపరేషన్ సింధూర్ లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని, నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అవనిగడ్డ : ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జరుగుతున్న ఎదురు కాల్పుల్లో భారత్‌లో చొరబడేందుకు ప్రయత్నిస్తున్న పాక్ మూకలను అడ్డుకునే క్రమంలో కాల్పుల్లో మురళీ నాయక్ మృతి చెందటం బాధకరమని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పాక్ సైనికుల కాల్పుల్లో వీరమరణం చెందిన జవాన్ మురళీ నాయక్‌కు ఆత్మశాంతి కలగాలని కోరుతూ అవనిగడ్డ నియోజకవర్గ బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు శుక్రవారం అవనిగడ్డలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు పాకిస్తాన్ సైనికులను మట్టుబెట్టిన నాయక్‌ఆత్మకు శాంతి కలగాలన్నారు. భారత జాతి మొత్తం సైన్యానికి మద్దతుగా నిలుస్తుందన్నారు. భారత్ మాతాకుజై అంటూ అవనిగడ్డలో భారీగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బండే శ్రీనివాసరావు, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, టివి. గిరి, బండే రాఘవ, షేక్ బాబావలి, మొగల్ మురాద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి



ఘంటసాల, మే 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మి, భోగా లక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ , ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామిని పెండ్లి కుమారుడిని చేయుట కార్యక్రమంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 11వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు స్వామి కల్యాణం నిర్వహించనున్నామన్నారు. 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణదేవరాయల మహోత్సవం కార్యక్రమం జరుగుతుందన్నారు. కృష్ణాదేవరాయల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాట్య కళావిశారద కె.వి.సత్యనారాయణ సమర్పించు గోదా కల్యాణం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించబడుతుందన్నారు. రాత్రి 7 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, ద్వాదశప్రదక్షిణలు, పుష్పయాగోత్సవాలు, పవళింపు సేవా కార్యక్రమాలతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


13 నుంచి టీటీడీ ప్రత్యేక కార్యక్రమాలు

అవనిగడ్డ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వేకనూరు గ్రామంలో 13 నుంచి 16 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ తెలిపారు. వేకనూరులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 13వ తేదీ ఉదయం 10 గంటలకు మహాభారత ఉపన్యాసం సింహాద్రి పద్మ చెబుతారన్నారు. 14వ తేదీన ఉపన్యాస భజన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. 15న భగవద్గీత ఉపన్యాస భజన, 16న సుహాసినిలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల ధర్మాచార్యులు గరికపాటి వీరాంజనేయులు, విశ్వ హిందూ పరిషత్ ప్రాంత సమరసత సహప్రముఖ్ లింగం బసవ శంకరరావు, గుండాబత్తిన నగరాయులు, తుంగల సాంబయ్య, సింహాద్రి శ్రీమన్నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

పోలాశమ్మ జాతర మహోత్సవం నేటి నుంచి

అవనిగడ్డ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలో కొలువై ఉన్న పోలాశమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మండలి వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్ మండలి శేషగిరిరావు (శేషు) తెలిపారు. 12వ తేదీన అమ్మవారి జాతర మహోత్సవ ఊరేగింపును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10.24 నిముషాలకు పోలాశమ్మ అమ్మవారికి అభిషేకాల అనంతరం పోతురాజు స్వామి ఉత్సవం నిర్వహించనున్నామన్నారు. 11వ తేదీన అమ్మవారు గుడి సంబరం నిర్వహించనున్నామన్నారు. 12వ తేదీ ఉదయం పోలాశమ్మ అమ్మవారికి వేడి నైవేద్యాలు సమర్పించనున్నామన్నారు. ఈ జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాసవీమాతకు లక్ష మల్లెలార్చన



పెడన, మే 9 (ఆంధ్రజ్యోతి) : కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల మూడో రోజైన శుక్రవారం వాసవీ మాతకు లక్షమల్లెల పుష్పార్చన, కుంకుమపూజలు నిర్వహించారు. మామిడి పండ్లతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. వాసవీ మహిళా మండలికి చెందిన మహిళలు లలితా పారాయణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని పల్లకీలో అధిష్ఠింపచేసి కన్నుల పండుగగా ఊరేగించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నంగేగడ్డలో విరుగులమ్మ జాతర రేపు

నాగాయలంక, మే 9 (ఆంధ్రజ్యోతి): నంగేగడ్డ లో కొలువైన విరుగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం నిర్వహించినట్టు ఆలయ ధర్మకర్త సనకా రమేష్ బాబు తెలిపారు. ఉదయం అమ్మవారికి మొక్కుబడులు , రాత్రికి జాతర నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి : కలెక్టర్

మచిలీపట్నం, మే9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంపికచేసిన గ్రామాల్లో పీఎం సూర్యఘర్ పథకాన్ని నూటికి నూరుశాతం అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. ఈ పథకం అమలుపై శుక్రవారం అధికారులతో కలెక్టర్ గూగుల్‌మీట్ నిర్వహించారు. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సౌరశక్తి పలకల ఏర్పాటుతో వినియోగదారులే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఎంపికచేసిన గ్రామాల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. పథకం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

నేడు అవగాహన సదస్సు

చల్లపల్లి : యార్లగడ్డలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించన్నుట్టు విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు. ఈ పథకం అమలుకు యార్లగడ్డగ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసినట్టు చెప్పారు.దరఖాస్తుల నమోదు, బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నాగాయలంక, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏటిమొగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ జి. వెంకటరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించనున్నామన్నారు. పెదపాలెం, ఏటిమొగ, చినకమ్మవారిపాలెం, పెదకమ్మవారిపాలెం, గుల్లలమోద, ఎదురుమొండి, బ్రహ్మయ్యగారిమూల, జింకపాలెం, ఏసుపురం, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అవనిగడ్డ: కోడూరు రోడ్డులో గల పాత సబ్ స్టేషన్ నెలవారి మెయింటేనెన్స్ కారణంగా పాత సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని 1వ వార్డు పూర్తిగా, 2, 3 వార్డులలో కొంత మేరకు, పులిగడ్డ, మోదుమూడి, అశ్వారావుపాలెం, రామచంద్రపురం, వలందపాలెం, సరదా కోడు, మాచవరంలోని కొంత మేరకు, మేడిలంక, దక్షిణ చిరువోలులంక, అయ్యవారిపాలెం, ఒడుగువారిపాలెం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే సమన్వయకర్త సుధారాణి

ఘంటసాల, మే 9 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో తప్పనిసరిగా ఓసారి భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. దీనివల్ల భూమిలో పోషణ సామర్థ్యం ఎంత మోతాదులో ఉందో ఇంకా అమ్లా, భూసార గుణాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. అనంతరం మట్టి నమూనా సేకరణపై నైపుణ్య శిక్షణా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, యార్లగడ్డ వీరభద్రరావు, పెదపూడి శివ నారాయణ, మైనేని మధుసూదనరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే కాగిత



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గూడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ధ్యేయమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గూడూరు మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల వద్ద నుంచి పలు అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. గత వైసీపీ ప్రజా సమస్యలను గాలికొదిలేసి అభివృద్ధి కార్యక్రమాలకు పాతర వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన స్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని బేసిక్‌హెల్త్ మెడికల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందూరు ఉమాశంకర్ డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని కోరుతూ బేసిక్‌హెల్త్ మెడికల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (బిహెచ్‌ఎంపిఏ) నాయకులు శుక్రవారం టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి లంకదాసరి ప్రసాదరావు సారథ్యంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కోలా వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు సాగిరాజు ఉదయభాస్కరరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగచంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ 2025కు హాజరయ్యే అభ్యర్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్టు మోపిదేవి బీసీ సక్షేమ వసతిగృహ అధికారి లంకేశ్వరరావు తెలియజేశారు. టెట్ పరీక్షలో ఉత్తీర్ణులై డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 200 మందికి అవకాశం కల్పించనున్నట్టు ఆయన తెలిపారు.

అధికారులకు సమ్మె నోటీసు

మచిలీపట్నం టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అర్బన్ సివిల్ సప్లై హమాలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమల్జేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం సివిల్ సప్లై అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో సివిల్ సప్లై హమాలీలు పాల్గొంటున్నారన్నారు. ప్రైవేటు గిడ్డంగులను ప్రోత్సహించకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గోదాముల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరువోలు జయరావు, హమాలీ ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు..

మచిలీపట్నం టౌన్: ఉపాధ్యాయుల వివిధ సమస్యలపై ఈనెల 12న నిర్వహించనున్న ధర్నా నోటీసు శుక్రవారం డీఆర్వో చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి రామారావులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె ఎ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ షౌకత్ హుస్సేన్, కనకారావు, గౌరవ అధ్యక్షుడు లెనిన్‌బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

